స్కెచ్

# "చదువుకున్నవారి కన్నా—"

యం. జానకీరాణి

పొద్దున్న ఏడున్నరకల్లా హాస్టలుకొచ్చే దోవలో కనుపిస్తుంది ఒక బక్కపిల్ల. మామిడిచెట్ల క్రిందగా నడిచి వస్తుంది పెద్దమూటతో. బ్రహ్మాండంగావున్న 'ఎంట్రెన్స్ గేటు' దాటి యూనివర్సిటీ మహిళా హాస్టలులోకి ప్రవేశిస్తుంది. విశాలంగా పరుచుకునివున్న రావిచెట్టు మొదట్లో తిన్నెలున్నాయి. వాటిమీద మూటదించి, బట్టలు విడదీసి, చిన్న చిన్న మూటలుకట్టి రూములలోకి వెడుతుంది.

ఆ పద్నాలుగేళ్ళ చాకలిపిల్ల పేరు సక్కు. 'విమెన్సు హాస్టలు' పిల్లల బట్టలు ఎన్ని సంవత్సరాలనుంచో వుతుకుతున్నారు వాళ్ళ కుటుంబ వ్యక్తులు. మోకాలుపైకి చిన్న నేతచీర బూడిద రంగుది కట్టుకుంటుంది. తల దువ్వుకున్నట్లు కనుపించదు. కాని ఎప్పుడూ ముఖాన నవ్వు తప్పదు.

ఒక్కొక్క బ్లాకులో బట్టలు యిస్తూ వస్తుంటుంది. బట్టలు వేసేవాళ్ళు పిలుస్తారు, తీసుకున్న వాళ్లు పద్దులు చూసుకుంటారు. రెండో బ్లాకులో బట్టలిస్తుంటే, మొదటి బ్లాకులోంచి వినవస్తుంది పిలుపు. 'సక్కూ!" అని పిలుస్తారు పొడుగాటి ముస్లిమ్ పిల్లలు. వాళ్ళపైజామాల యిస్త్రీ సరిగ్గా లేదు. నాలుగు పైజమాలు తిరిగి యిచ్చి మళ్ళీ చేసుకురమ్మంటారు. "అచ్ఛాఅమ్మా!" అంటుంది సక్కు.

ఈలోగా రెండో బ్లాకులోంచి "సక్కూ" అన్నపిలుపు ప్రతిధ్వనిస్తుంది వరండాల్లో. "అమ్మా" అంటూ పరుగులమీద వెడుతుంది సక్కు.

"ఇదిగో యీబట్టలు పదహారు. ఆజార్జెట్ రంగు పోయిందంటే వూరుకోను. ఈ నూలు చీరెలన్నిటికీ గంజి బాగా పెట్టుకురావాలి." అని ఫరమాయిస్తుంది ఒక సీనియరు అమ్మాయి.

"మంచిదిఅమ్మా." అంటుంది సక్కు నవ్వుతూ. సక్కు తెచ్చిన బట్టలు చూసుకుంది రుక్మిణి అనే సుందరాంగి. ఆ రోజు ఆవిడ ఫస్టవరు క్లాసుమానేసి, వాళ్ళ బావని కలుసుకోవాలి. చెమ్కీపూల తెల్ల జార్జెటు కట్టుకుంది క్రిందటి మాటు ఆమె. ఆ బావ మురిసిపోయి, 'వెన్నెలలాగా, మల్లెపూవులాగా, వున్నా'వని ఎన్ని మాట్లు అన్నాడు! ఆనాటి మాటలు తలుచుకుని, తలుచుకుని, రుక్మిణి మనస్సులో ఆరాటపడి పోయింది ఉతుకుకి వెళ్ళిన ఆ చీరెకోసం. వేళకు ఆ చీరె తెచ్చినందుకు సక్కుని వేయివిధాల ప్రశంసించింది ఆమె.

ఆద్దంముందు నుంచునీ, తెల్లక్రేప్ జాకెట్టు కాలరు సరిచేసుకుని, రెండు జడలకి తెల్ల శాటిన్ రిబ్బన్లు కట్టుకుంది రుక్మిణి. మల్లెపూవులాంటి ఆ చీరెని ఒంటిమీద వేసుకుని చూసి, సిగ్గుపడుతూ నవ్వి, ఒక్క నిముషంలో కట్టేసుకుంది. కానీ—కానీ—ఆ చీరెమీద...పమిటమీద కాణీ అంత నల్లని మరక! కళ్లు పెద్దవిచేసి, పరీక్షగా చూసిన రుక్మిణి కోపగించుకుంది. చీకాకుపడింది. చెదరి పోయిన కలను తల్చుకుని ఆమె హృదయం బాధతో స్పందించింది. "సక్కూ!" అని కోపంగా, గట్టిగా యెలుగెత్తి పిల్చింది. సక్కు వచ్చింది. "ఏమిటిది?" అని గర్జించింది రుక్మిణి. చిరునవ్వు పోలేదు సక్కు ముఖాన.

"ముందే వుండెను అమ్మా అది." అంది.

"లేదు. లేదు. తీసుకపో." అని కోపంతో ఆ చీరె గబగబ విప్పి సక్కుముఖాన కొట్టి, మరో చీరె తీసుకుంది. సక్కు నిశ్శబ్దంగా నిల్చున్నది. "మళ్ళీ ఉతుక్కురావాలీ అమ్మా?" అన్నది మెల్లిగా. రుక్మిణి రోషంతో వుంది అసలే. "లేకపోతే నన్ను చాకిరేవు పెట్టుకోమంటావా?" అని వురిమి, బొట్టు దిద్దుకోవడంలో నిమగ్నమైంది రుక్మిణి...

సక్కు మరోగదిలోకి వెళ్ళింది.

"ఇదేమిటి సక్కూ? ఈ జరీచీర యిస్త్రీ ఏవిటి? తెల్ల బట్టలకి అసలు నీలిమందే వేయడంలేదు." అన్నది మృదువుగా రోహిణి.

"అది రాలేదు అమ్మా. నిండా కష్టమైంది యిస్త్రీ చేసేదానికి." అన్నది సక్కు అర్థంలేని చిరునవ్వుతో.

ఓనిముషమాగి, "పైసలు యిస్తారమ్మా." అని అడిగింది సంకోచంతోనే. అలమారు తెరిచి డబ్బు యిచ్చేసింది రోహిణి. సక్కు డబ్బు లెఖ్ఖపెట్టి అర్థంకానట్లుచూసి, "ఇదేమిటి అమ్మా, సిల్కు చీరెకి ఎన్ని పైసలు యిచ్చినారు?" అన్నది.

"రెండణాలు" అన్నది రోహిణి పరధ్యానంగా. లేతాకుపచ్చ చీరెమీదకి ముదురాకుపచ్చ క్రేపా, నలుపు కణువుచోళీయా అన్న సమస్య తేలక అవస్థపడుతోంది ఆమె.

"అదిఏమిటి అమ్మా. నాల్గుఅణాలుయియ్యాల. అందరు అట్లనే యిస్తారు." అన్నది సక్కు.

"ఎవరిస్తున్నారు? నేనెప్పుడూ యివ్వలేదు." అన్నది రోహిణి చటుక్కున వెనక్కు తిరిగి.

"లేదు అమ్మా. నేను అబద్ధం చెప్పలేదు."

"నేనివ్వను." అన్నది రోహిణి. సక్కు ముఖంలో చిరునవ్వు ఒక్కక్షణం మాయమైంది. కానీ మరుక్షణంలోనే, "అట్ల చెప్పవద్దు అమ్మా అన్యాయం సెయ్యవద్దు అమ్మా" అన్నది దీనంగా, అమాయికంగా. కాని వినదు రోహిణి. వినిపించుకోదు. ఆకుపచ్చ చీరె, నల్ల జాకెట్టు తీసుకుని సన్నగా పాడుకుంటోంది ఆమె.

"సక్కూ!" మూడోబ్లాకులోంచి మరో కంఠం.

"వస్తుంటి అమ్మా." అంటుంది సక్కు.

"క్రిందటిమాటు టవల్ బాకీ ఏదీ?" అనడిగింది జడేసుకుంటూ రత్నమాల.

సక్కు నాలిక్కరచుకుంది. "అరె! మర్చిపోయాను అమ్మా. రేపు తీసుకువస్తాను" అన్నది.

"సరే. నా నల్లచుక్కల బ్లౌజ్ వుండాలి. కనుపించటంలేదు. ఏమైంది?" సక్కు అర్థంకానట్లు చూసింది.

"ఏది అమ్మా? నాకు యిచ్చినారు?" అన్నది.

"ఔను. ఎప్పుడో వేశాను. ఉండాలి చూడు" అన్నది రత్నమాల.

"లేదు అమ్మా. మాదగ్గర వుంటే ఎక్కడా పోదు."

"ఉంటుంది చూడు." అని స్నానానికి పోబోతోంది రత్నమాల.

"అమ్మా, పైసలు యిస్తారూ?" అంది సక్కు.

"ఇప్పుడు కాదు. రేపు." రత్నమాల వెళ్ళిపోతోంది. సక్కు వెంట వెళ్ళింది.

"మాది నాయన కోపం చేస్తాడు అమ్మా. జరూర్ అనినాడు. ఇవ్వరా అమ్మా?" అన్నది సక్కు. రత్నమాలకి కోపం వచ్చింది. "ఇస్తాలే ఫో. ఏమిటి అప్పులదానల్లే గొంతుమీద కూర్చుంటావు? ఇలా గల్లంతు చేస్తే అసలివ్వను" అంటూ విసవిస నడిచింది రత్నమాల.

హాస్టలులో గంటకొట్టారు ఫలహారానికి. పిల్లలంతా-గ్రాడ్యుయేట్లు, కాబోయే గ్రాడ్యుయేట్లు, కాబోయే వైద్యులు, ఉపాధ్యాయులు, ఇంటర్మీడియేట్లు అంతా పోతున్నారు గుంపులు గుంపులుగా. నేతచీరెలు, జార్జెట్లు, షిఫాన్లు, క్రేపులు, ప్రింటెడ్స్, వాయల్స్—రకరకాలు, రంగులురంగులు, చిత్రవిచిత్ర అద్దకాలు అల్లా నడిచిపోతున్నాయి.

చిన్నచిన్న బట్టల, మూటలు కట్టుకుంటూ వాళ్ళవంక అలా చూస్తూ నిలబడింది సక్కు. ఆ రంగులు సీతాకోకచిలుకల్ని, పూలతోటల్ని, జ్ఞాపకానికి తెస్తున్నాయి. అవన్నీ, ఆ బట్టలన్నీ తను కాయకష్టంచేసి శుభ్రం చేసింది. తన స్వహస్తాలతో మడిచి, యిస్త్రీ చేసి, పువ్వులకన్న పదిలంగా పట్టుకొచ్చింది.

కాని, కొందరి నూలుచీరెలకి గంజి చాలదు, తెల్లబట్టలకి నీలిమందు చాలదు; మరి కొందరికి యిస్త్రీ సరిపడదు. ఇవ్వాల్సిన డబ్బు యివ్వడం కష్టం కొందరికి. ముస్తాబుతో అసలే తీరిక వుండదు మరి కొందరికి.

ఇవన్నీ తలుచుకుని ఆ 'అమ్మ'ల మీద కసురుకోదు సక్కు. వాళ్ళని మనస్సులోనైనా తిట్టుకోదు. చిరునవ్వుతో అందర్నీ చూస్తూ, పెద్ద మూట కట్టుకుంటుంది. నెత్తిమీద బరువుగా పెట్టుకుని, రావిచెట్టు రొదలో కలిసేలా ఏదో కూనిరాగం తీస్తూ నడక ప్రారంభిస్తుంది. "సక్కూ!" అన్న పిలుపు వినిపించినట్లయి వులిక్కిపడి వెనక్కి చూసి, తన భ్రమకి తానే నవ్వుకుంటుంది. బ్రహ్మాండమైన 'ఎంట్రెన్ గేటు' దాటి, మామిడిచెట్టు నీడలో నడిచిపోతుంది సక్కు. ★